కేక్ కట్ చేస్తున్న జాగృతి నాయకులు

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదినోత్సవం

కల్వకుర్తి, మార్చి 13 : భారత జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదినోత్సవాన్ని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు పావనీ, గణేశ్, కిశోర్, వాణి, ప్రణీత్, రమేశ్, జంగయ్య, నాగరాజు, అభినవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి గువ్వల పరామర్శ

నారాయణ్‌రావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు, మార్చి 13 : మండలంలోని గాజర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నారాయణ్‌రావు తల్లి లచ్చలమ్మ మంగళవారం మృతి చెందింది. దీంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం గ్రామానికి చేరుకుని నారాయణ్‌రావుతో పాటు ఆయన కుమారుడు శ్రీపతిరావును పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లాలూయాదవ్, నాయకులు అంజి, రాజు, సురేష్ యాదవ్, శ్రీను, జగదీశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

బూర్గుల సేవలు చిరస్మరణీయం

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

అచ్చంపేట టౌన్, మార్చి 13 : అచ్చంపేటలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల అనుబంధంగా నడుస్తున్న వనవాసీ సేవా ప్రకల్ప బాలుర ఆవాసంలో బూర్గుల రామకృష్ణారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పట్టణ క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ పుట్టినరోజును విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు వెంకటేశ్ రూ.2వేలు, సత్యనారాయణ రూ.1,500, కిశోర్ రూ.1,500, సాయిప్రసాద్ రూ.వెయ్యితో విద్యార్థులకు దుస్తులు, గేమ్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు మురళి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాయలగండిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో నిర్వహిస్తున్న అర్చకులు

అమ్రాబాద్, మార్చి 13 : పదర మండలంలోని రాయలగండిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపానోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆయన సతీమణి (జెడ్పిటీసీ) అనురాధ ఆలయానికి రాగా అర్చకులు స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి, వార్లకు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి యజ్ఞంలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. అదేవిధంగా అమ్రాబాద్ జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన టెన్త్ ఫేర్‌వెల్ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

కేంద్రం బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అచ్చంపేట టౌన్, మార్చి 13 : అచ్చంపేట పట్టణంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి మసీదు వరకు, అక్కడి నుంచి కొత్త బస్టాండ్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై రాము, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తి రూరల్, మార్చి 13 : వేసవి సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకట్రాములు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వంద శాతం పన్నులను వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తలెత్తే సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలోఎంపీవో దేవేందర్, కార్యదర్శులు తదితరులున్నారు.

ఇంటి పన్నును వందశాతం వసూలు చేయాలి

వంగూరు, మార్చి 13 : ప్రతిగ్రామంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నును వందశాతం వసూలు చేయాలని ఎంపీడీవో విజయభాస్కర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిసిబ్బంది, కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీల కోసం తాగునీటితో పాటు సరైన వసతులు కల్పించాలన్నారు. వేసవిదృష్ట్యా నర్సరీల్లో మొక్కలకు సకాలంలో నీటిని అందించి వాటిని సంరక్షించాలన్నారు. సమీక్షలో ఎంపీవో కృష్ణ, ఏపీవో కృష్ణయ్యతో పాటు కార్యదర్శులు, టీఎలు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

- మిషన్ భగీరథపై సమీక్షలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ ,పాల్గొన్న అధికారులు

అచ్చంపేట రూరల్, మార్చి 13 : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. బుధవారం మండలంలోని రంగాపూర్‌లోమిషన్ భగీరథ పంప్ హౌజ్ వద్ద నిర్వహించిన మిషన్ భగీరథ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతిరోజూ నీటి సరఫరాను పరిశీలించాలన్నారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు సంబంధించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. సమీక్షలో మిషన్ భగీరథ డీఈఈ మణిపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హేమలత, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈలు, వాటర్‌మెన్లు పాల్గొన్నారు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి సన్మానం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 13 : జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడం, ఆర్‌పీఎస్ 2013 బాండ్ డబ్బులు చెల్లించడంపై వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.చారి, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా మొల్లమాంబ జయంతి

కల్వకుర్తిలో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బిజినేపల్లిలో మొల్లమాంబ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

కల్వకుర్తి,మార్చి 13 : పట్టణంలో బుధవారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహ, రాజశేఖర్, సత్యం, లక్ష్మయ్య, చంద్రయ్య, శేఖర్, పర్వతాలు, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, మార్చి 13 : మండలకేంద్రంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం నిర్వహించారు. గ్రంథాలయం పక్కనున్న ఆమె విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘుబాబు, పులేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

అచ్చంపేట టౌన్, మార్చి 13 : అచ్చంపేట పట్టణంలో నిర్వహిస్తున్న ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు సజావుగా కొనసాగాయి. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 181మందికి 172 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 211మందికి గానూ 186 మంది, ప్రగతి జూనియర్ కళాశాలలో 270 మందికి 237మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అదేవిధంగా త్రివేణి జూనియర్ కళాశాలలో 261 మందికి 235 విద్యార్థులు, చైతన్య జూనియర్ కళాశాలలో 228మందికి 214 విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా 1,151 మంది విద్యార్థులకు గానూ 107 మంది గైర్హాజరు కాగా 1,044 మంది పరీక్ష రాసిన ట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య, జయమ్మ, శ్రీనివాస్‌గౌడ్, రవి, మల్లయ్య తెలిపారు.

113 మంది విద్యార్థులు గైర్హాజరు

కల్వకుర్తి రూరల్, మార్చి 13 : పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైఆర్ఎం, ఎంజేపీ కల్వకుర్తి, ఎంజేపీ ఊర్కొండ, కృష్ణవేణి, న్యూఎరా కళాశాలల్లో 1,588 మంది విద్యార్థులకు 113 మంది గైర్హాజరు కాగా 1,475 మంది హాజరైనట్లు ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి తెలిపారు.

నలుగురు గైర్హాజరు

తిమ్మాజిపేట, మార్చి 13 : మంగళవారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి వెంకన్న తెలిపారు. మొత్తం 160మందికి156 విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై..

స్వయం పరిపాలన విద్యార్థులు

తాడూరు, మార్చి 13 : మండల కేంద్రంలోని సిద్దార్థ మోడల్ స్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలను బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఉగాదికి ప్రత్యేక ఏర్పాట్లు

- కాలినడక భక్తులకు అధిక ప్రాధాన్యం
- దారి పొడవునా సేవాకార్యక్రమాలు
- ఐదు రోజులపాటు మహోత్సవాలు
- లడ్డూ ప్రసాదాలపై ప్రత్యేక దృష్టి : ఈవో

అధికారులతో సమావేశమైన ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 13 : శ్రీశైల క్షేత్రంలో నిర్వహించే ఉగాది ఉత్సవాలను సమిష్టి అవగాహనతో విజయవంతం చేయాలని ఈవో పెద్దిరాజు కోరారు. బుధవారం దేవస్థాన పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్, పోలీస్ శాఖల సూచన మేరకు ప్రత్యేక సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పార్కింగ్ అందుబాటులో ఉంచాలని ఆదేశాలిచ్చారు. ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. కాలినడకన వచ్చే భక్తులకు మంచినీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి పరిశుభ్రత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిద్ధరామప్ప కొలను, టూరిస్ట్ పార్కింగ్, ఔటర్ రింగ్‌రోడ్డు, డార్మిటరీలు, నిత్యాన్నదాన సత్రాలు, ఉద్యానవనాలతోపాటు వివిధ ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివిధ భాషల్లో సూచిక బోర్డులు, సమాచార కేంద్రాల ఏర్పాటు వంటివాటిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఈవో, పోలీస్ ఇన్‌స్పెక్టర్, ఏసీ, ఈఈ, సీఎస్‌వో, ఏఈవోలు, పీఆర్‌వోలు పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తాసీల్దార్ శ్రీకాంత్

కొల్లాపూర్ రూరల్, మార్చి 13: మండలకేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీకాంత్ కేవీపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, కార్యదర్శి రాజు, నాయకులు సంజు, శివ పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి కార్యాలయానికి ఏవో బదిలీ

కొల్లాపూర్ రూరల్, మార్చి 13 : ఉమ్మడి మండలాల భూసార పరీక్ష కేంద్రం అధికారి, ఏవోగా పనిచేస్తున్న నాగరాజు బుధవారం మంత్రి జూపల్లి క్యాంప్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. రెండు మండలాల రైతులు, ప్రజల మన్ననలు పొందిన వ్యవసాయ అధికారిగా మంచి గుర్తింపు పొందారు. ఆయన స్థానంలో రమేశ్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు బైక్‌ల వేలం

కొల్లాపూర్ రూరల్, మార్చి 13 : కొల్లాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టుబడిన ఐదు బైక్‌లను గురువారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారి నాగిరెడ్డి బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గురువారం ఉదయం 10గంటలలోపు డిపాజిట్ చెల్లించాలని కోరారు.

బస్సు చార్జీలు తగ్గించాలి

కొల్లాపూర్ రూరల్, మార్చి 13 : ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించాలని బీఆర్ఎస్ నాయకుడు కుమార్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి బస్సులను తగ్గించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే బస్సుల సంఖ్యను పెంచి చార్జీలను తగ్గించాలని కోరారు.

వాల్మీకులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్ రూరల్, మార్చి 13 : వాల్మీకులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆ సంఘం నాయకుడు పరమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకులను విస్మరించడం శోచనీయమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వాల్మీకుల ఓట్లతోనే ఎక్కువ సీట్లు గెలిచారని, వారికి జరిగిన అన్యాయంపై భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రం ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

ఊర్కొండ, మార్చి 13 : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మజ్జిగా, రాగిఅంబలిని జిల్లా కరాటే,కబడ్డి అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చినెల ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతుండడంతో విద్యార్థులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సందీప్, గోపి, కొమ్మెశ్రీను, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 13 : ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, గణేశ్ బుధవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్పొరేషన్ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మంత్రి జూపల్లికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ, మార్చి 13 : మండలంలోని చెదురుపల్లికి చెందిన సుగుణమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న మండల బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తాలుకా ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేలు, 540కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి, అంతిరెడ్డి, వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, దాసు, పెద్దయ్య తదితరులున్నారు.

16న బెస్ట్ వెస్ట్ ఎగ్జిబిషన్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 13 : జాతీయ హరితదళాలు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో బెస్ట్ వెస్ట్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు డీఈవో గోవిందరాజులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిని కాపాడుకోవడం అనే అంశాలను వివరించడం, వ్యర్థాలుగా మనం పారవేసే వస్తువుల నుంచి హ్యాండిక్రాఫ్ట్స్ మోడల్స్‌ను తయారు చేసి ఎగ్జిబిషన్‌ను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలనేది ఈ ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పారితోషికం, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ప్రతి ప్రదర్శనకు ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు హాజరు కావాలన్నారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రదర్శనల తయారీకి సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి 9989921105 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

బల్మూరు, మార్చి 13 : మండలంలోని మైలారం గ్రామంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై బాలరాజు బుధవారం తెలిపారు. మృతురాలికి దాదాపు 40ఏళ్ల వయసు ఉంటుందని, శవం పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 8712 657736, సీఐ 8712657731 నెంబర్లకు సమాచరం ఇవ్వాలన్నారు.

రేపు ఉచిత గైనిక్ క్యాంప్

తిమ్మాజిపేట, మార్చి 13 : మండలంలోని ఆవంచలో 15న ఏగూర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత గైనిక్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు దవాఖాన ప్రతినిధి శంకర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని డెలివరీ, గర్భసంచి సమస్యలను ఉచితంగా పరీక్షిస్తారన్నారు. సుఖ ప్రసవానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు ప్రొటీన్ పౌడర్, ఇతర మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

గుండాలలో వైభవంగా చిన్నతేరు

వెల్దండ, మార్చి 13 : మరో దక్షిణకాశిగాప్రసిద్ధి చెందిన గుండాల గ్రామంలోని అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారు జామున చిన్న పుష్పరథోత్సవాన్ని (చిన్నతేరు) వైభవంగా నిర్వహించారు. వందలాదిగా భక్తులు పాల్గొని తేరు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్, అర్చకులు బాలస్వామి, కృష్ణయ్య, సంతోశ్, నరహరి, శివకుమార్, సురేష్ పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు పంపిణీ

తాడూరు, మార్చి 13 : మండలంలోని ఇంద్రకల్‌లో పశువులకు బుధవారం గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు జేఈవో రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 766 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జ్ఞానయ్య, మల్లేశ్, మధు, ఈదమ్మ, నిరంజన్, ఇతర అధికారులు ఉన్నారు.